

# మరో అడుగు

## - డా.వేదుల సుభద్ర



(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

లోపలేం జరుగుతోందో తెలియని ఆదుర్దాతో గట్టిగా కొట్టుకుంటోంది రాధిక గుండె.

కిరణ్ చేతిలో బిగుసుకున్న ఆమె చెయ్యి సన్నగా  వణుకుతోంది.

అనునయంగా భార్య భుజాన్ని తట్టాడు కిరణ్.

గంటలా గడిచినట్టనిపించిన ఐదు నిమిషాల తర్వాత డాక్టర్ రాజేష్ గదిలో అడుగుపెట్టారు ఇద్దరూ.

చల్లగా కొట్టింది ఏ.సీ గాలి.

చేతిలో ఫోన్ తో తన టేబిల్ పక్కగా నిలబడి ఉన్నారు డా.రాజేష్.

ఆయన నిలబడిన తీరుఎప్పటిలా స్థిరంగా అనిపించలేదు రాధికకి.

'తన మనసులో ఉన్న ఆత్రుతతో అలా అనిపిస్తోందేమో, ఆయన మామూలుగానే ఉన్నారేమో!' అనుకోవడానికి ప్రయత్నిస్తూ డా. స్నేహ వైపు చూపు సారించింది.

డా.రాజేష్ ఎప్పుడూ కూర్చునే కుర్చీలో కూర్చుని ఉందామె. టేబిల్ మీద, ఎదురుగా స్వప్నిక రిపోర్ట్ ఉంది.

" డాక్టర్! ఎందుకు అర్జంట్ గా రమ్మన్నారుట? స్వప్నికేమీ కాలేదు కదా?రిపోర్ట్ లో ఏముంది?" ఒక్కో మాటా కూడబలుక్కున్నట్టుగా,  పేర్చుకుంటూ అడిగాడు కిరణ్.

డాక్టర్లిద్దరూ మాట్లాడలేదు ఒక్క క్షణం.

" చెప్పండి డాక్టర్" అంది రాధిక.

“మీరిద్దరూ కంగారుపడకుండా, కాస్త నెమ్మదిగా నేను చెప్పే మాట వినండి. రిపోర్ట్ లో కంగారుపడేదేమైనా ఉందా? అంటే లేదనిపిస్తోంది. కానీ కొన్ని తేడాలు మాత్రం కనిపిస్తున్నాయి.” అన్నాడు డా.రాజేష్.

“తేడాలా, అంటే? “ బేలగా అడిగింది రాధిక

“అదే! కొద్దిగా బ్లడ్ సెల్ ప్రొఫైల్ లోని సెల్స్ అంటే కణాలలో తేడా. మరొకసారి టెస్ట్ చేయిస్తే బావుంటుందేమో అంటున్నారు రాజేష్" ఈసారి స్నేహ చెప్పింది నెమ్మదిగా.

" మళ్ళీ బ్లడ్ టెస్టా? ఎందుకు డాక్టర్? ఏమైంది? ఏముంది అందులో? బ్లడ్ సెల్ ప్రొఫైల్ అంటే ఏమిటి?" అడిగింది రాధిక.

“కంప్లీట్ బ్లడ్ టెస్ట్ (CBT) అనే ఈ పరీక్షలో రక్తం లోని వివిధ కణాలని, అవి ఉన్న మోతాదు నీ తెలుసుకునేందుకు చేయిస్తాము. ఇది మీకు కూడా తెలుసు కదా!

ఎర్రవి, తెల్లవి రక్తకణాలు, హీమోగ్లోబిన్ శాతం, ప్లేట్లెట్స్ లాంటివన్నీ వివరంగా చూపిస్తుంది ఈ రిపోర్ట్. దానివల్ల మనకి చాలా విషయాలు తెలుస్తాయి ఉదా. రక్త హీనత, ఏదైనా రక్త సమస్యలు ఇలాంటివన్నమాట.”

“అవును డాక్టర్. అయితే ఇప్పుడు స్వప్ని రిపోర్ట్ లో తేడా ఏముంది? ఎందుకు మీరిద్దరూ ఇలా డల్ గా ఉన్నారు? ఇన్నేళ్ళ మనపరిచయం లో మిమ్మల్నిద్దరినీ ఎప్పుడూ ఇలా చూడలేదు. దయచేసి చెప్పరూ, అసలు విషయమేమిటో. స్వప్నికి ఏమీ ప్రమాదం లేదు కదా.” అంది రాధిక

" అదేమీ లేదమ్మా, కొద్దిగా తెల్ల రక్త కణాలు బాగా ఎక్కువగా కనిపిస్తున్నాయి. మనకి ఇన్ఫెక్షన్లు, జ్వరం లాంటివి వచ్చినప్పుడు తెల్ల రక్త కణాలు, ల్యూకోసైట్లు అని పిలవబడేవి పెరగడం సహజమే. ఇవి ఇన్ఫెక్షన్లు మరియు వ్యాధులతో పోరాడటం ద్వారా మన శరీరపు రోగనిరోధక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తాయి.

ఇన్ఫెక్షన్లు, వాపులు మరియు ఇతర సమస్యలవల్ల కూడా తెల్ల రక్త కణాల సంఖ్య పెరగడానికి అనేక కారణాలు ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో, కారణం తెలియదు.

మన స్వప్నికి ప్రస్తుతం తెల్ల రక్త కణాల సంఖ్య సాధారణ సంఖ్య కంటే బాగా ఎక్కువగా ఉండడానికి కారణం ప్రస్తుతం తనకున్న ఇన్ఫెక్షన్ వల్ల కావచ్చు, అదేనా, మరేదైనానా? అనేది తేల్చుకోవడానికే మరొక సారి టెస్ట్ చేద్దాం అనుకుంటున్నది. "

సాధ్యమైనంత నెమ్మదిగా, నిదానంగా చెప్పారు డా.రాజేష్.

'అలాగా?' అన్నట్టుగా సాలోచనగా చూశాడు కిరణ్.

'నిజంగానా? నిజంగా అంతేనా?'అన్నట్టుగా సందేహంగా చూసింది రాధిక.

మొత్తమ్మీద ఇద్దరూ మాట్లాడలేదు కొన్ని క్షణాలపాటు.

"అదేనా, మరేదేనైనా? అంటే ఏమిటి? డాక్టర్ మరేదైనా అంటే? " కొద్దిగా గద్గదమౌతున్న గొంతుతో అడిగింది రాధిక.

" ఈ మధ్య కొన్ని బాక్టీరియా మందులకి కూడా లొంగడం లేదు. ఆంటీ బయాటిక్స్ లాంటి మందులు వాడినా కూడా కొద్దిగా తగ్గినట్టనిపించినా, మళ్ళీ పుంజుకుంటున్నాయి. 'డ్రగ్ రెసిస్టెంట్ బాక్టీరియా' అంటారు. అలాంటి పరిస్థితి ఉన్నప్పుడు కూడా చాలా రోజులు జ్వరం తగ్గకపోవడం సాధారణమే. అలాంటిదేదైనా ఉండవచ్చు కూడా" అంది డా.స్నేహ రాధిక కి నచ్చచెబ్తున్నట్టు.

"ఈ మధ్య బాగా అలిసిపోయింది కదా 'ఎనిమిక్' కూడా అయి ఉండవచ్చు కూడా." రాజేష్ అన్నారు.

" అంతేకదా?' మరేమీ పరవాలేదు కదా, నాకెందుకో మీ ఇద్దరినీ చూస్తూ ఉంటే, మీరేదో దాస్తున్నట్టుగా అనుమానంగా ఉంది" అంది రాధిక.

" లేదు, లేదు. ఏదైనా ఉంటే మొదట మీకే కదా మొదట చెప్పాలి. ఎందుకు ఉన్నాయో తెలియదు కానీ తెల్ల రక్తకణాల సంఖ్య ఎక్కువగా ఉంది. దానికి కారణం ఏమిటి? అని తేల్చుకోవాలి కదా. అందుకే మరొకసారి టెస్ట్ చేయిద్దామనేది."

డా. రాజేష్ మాటలు కొద్దిగా స్వాంతననిచ్చాయి రాధిక కి.

" ఎప్పుడు చేయిద్దామంటారు డాక్టర్? మొన్న చేయించిన సెంటర్ లో సిస్టర్ చాలా తేలిగ్గా చేసారని స్వప్ని సంతోషపడింది. కనక మరో సారి చేయించుకోమంటే గొడవచేయకపోవచ్చు" అన్నాడు కిరణ్ నవ్వడానికి ప్రయత్నిస్తూ.

రాజేష్ కూడా చిన్నగా నవ్వారు 'దట్స్ గుడ్' అంటూ.

మరో రెండు రోజులు చూద్దాం, జ్వరం జారుతుందేమో. తగ్గి, పిల్ల లేచి తిరిగి మాములుగా ఉంటే మంచిదే కదా, లేకపోతే రెండు రోజులాగి చేయిద్దాం. అప్పటివరకు తనని వీలైనంత విశ్రాంతి తీసుకునేలా చూస్తూ, ఆరోగ్యకరమైన ఆహారం పెట్టండి. నేను ఫోన్ చేసి కనుక్కుంటూ ఉంటాను, అవసరమైన వెంటనే చెప్తాను. అన్నాడు డా. రాజేష్.

మరి కాసేపట్లో కాన్ ఫరెన్స్ ముగించుకుని వస్తున్న తన స్నేహితుడు డా. సుజిత్ తో మాట్లాడి, ఆపైన తర్వాత ఏం చెయ్యాలో నిర్ణయించాలి అనుకున్నాడు.

దానికి కొంత సమయం కావాలి కనకనే ఇలా నచ్చచెప్పి వారిద్దరినీ ఇంటికి వెళ్ళిపోమన్నాడు.

చేసేదేమీ లేదు కనక కిరణ్, రాధిక ఇంటికి బయలుదేరారు.

వేచి ఉండడం, ఆత్రుతగా రావడం వీటివెనక ఉన్న ఆదుర్దాతో అలసిపోయింది రాధిక.

" టీ తాగుదామా?' అడిగాడు కిరణ్.

మౌనంగా తల ఊపింది.

ఇద్దరూ పక్కనే ఉన్న చిన్న హొటల్ లో టీ తాగి, గబ గబా ఇంటికి చేరుకున్నారు.

స్వప్నిక ఇంకా పడుకునే ఉంది.

తరచుగా వస్తున్న జ్వరం, నీరసం వల్ల బాగా చిక్కింది. అసలే పొడగరి కావడాన మరింత పొడుగ్గా కనిపిస్తోంది. పల్చటి చెక్కిళ్ళూ, మూసుకున పెద్ద కళ్ళు. కూతురి జుట్టు సవరించి దుప్పటి సరిగ్గా కప్పింది రాధిక.

" అమ్మలూ!" అని పిలవబోతున్న కిరణ్ ని వారించింది " పడుకోనివ్వండి, రెస్ట్ కావాలన్నారు కదా డాక్టర్" అని.

తర్వాత ఏదో గుర్తొచ్చినదానిలా లేచి వెళ్ళి వంటగదిలో ఊ మూల పెట్టుకున్న చిన్న దేవుడి మందిరం ముందు కూర్చుని, కళ్ళు మూసుకుని మనసులోనే ప్రార్థించుకోవడం మొదలు పెట్టింది. ప్రతి రోజూ ధ్యానం చేసుకోవడం రాధిక కి అలవాటే.

ఆమెకు అంతరాయం కలగకూడదని వంటగది తలుపు దగ్గరగా వేసి వచ్చాడు కిరణ్.

---------------------

కిరణ్, రాధిక వెళ్ళిన మరో గంటన్నర తర్వాత రాజేష్ తన స్నేహితుడు డాక్టర్ సుజిత్ కి ఫోన్ చేశాడు. మూడో రింగులో ఫోన్ ఎత్తాడాయన.

" రాజా, ఇవ్వాళ ఖాళీగా ఉన్నావా? నేను గుర్తొచ్చాను." నవ్వుతూ అడిగాడు.

రాజేష్ నవ్వలేదు. వెంటనే తన సంభాషణ మొదలుపెట్టాడు

"సుజీ, సారీ, దిగినవెంటనే ఫోన్ చేసి ఇబ్బంది పెడుతున్నానేమో. కానీ, నీతో ఓ ముఖ్యమైన విషయం మాట్లాడాలి, నీ సలహా కావాలి. నా పేషెంట్, పధ్నాలుగేళ్ళ చిన్న పిల్ల. బ్లడ్ ప్రొఫైల్ చేయించాను. రిపోర్ట్ సరిగా అనిపించడం లేదు. నిన్నొకసారి సలహా అడుగుదామని" అంటూ టూకీగా స్వప్నిక గురించి, ఆమె పడిపోవడం దగ్గరనించీ, తగ్గకుండా వస్తున్న జ్వరం వగైరాల గురించీ, చివరికి బ్లడ్ టెస్ట్ రిపోర్ట్ గురించీ అన్నీ చెప్పాడు డా.రాజేష్

స్నేహితుడు ఫోన్ లో చెప్తున్నదంతా శ్రద్ధగా వింటూ మధ్య మధ్యలో చిన్న చిన్న ప్రశ్నలు వేస్తూ మొత్తం వ్యవహారాన్ని అంచనా వేశాడు డా.సుజిత్

" నువ్వు చెప్పినవన్నీ విన్నాకా నేను చెప్పేది ఒకటే. పాపకి వెంటనే 'బోన్ మేరో' లేదా 'ఎముక మజ్జ' టెస్ట్ చేయించడమే మనకున్న ముఖ్యమైన మార్గం. దాని ఫలితాన్ని బట్టే మనకి అసలు విషయమేమిటో ఖచ్చితంగా తెలుస్తుంది.

దానికి తోడు నువ్వు అమ్మాయిని రెగ్యులర్ గా చెక్ చేస్తూ ఉంటావు కనక తను ఎలా కోలుకుంటోంది అన్న విషయం తెలుస్తుంది కదా. అందుకని వెంటనే బోన్ మేరో టెస్ట్ చేయించు. రిజల్ట్ వచ్చాకా నేను కలుస్తాను" అన్నాడు తన ప్రముఖ కేన్సర్ స్పెషలిస్ట్ డా.సుజిత్.

"అంతేనా? అంటే?" ఆత్రంగా అడుగుతున్న స్నేహితుడి ఆపుతూ,

" అప్పుడే ఏమీ చెప్పలేము, చెప్పకూడదు కూడా. టెస్ట్ రిపోర్ట్ చూశాకానే మాట్లాడదాం." అన్నాడు డా. సుజిత్.

" సరే, సరే. అంతకన్నా చేసేదేమీ లేదు కనక, అదే చెయ్యాలి.ఓకే" అంటూ ఫోన్ పెట్టేశాడు.

జరుగుతున్న సంభాషణని బట్టీ, భర్త ముఖ కవళికలని బట్టీ విషయాన్ని తేలిగ్గానే అర్థం చేసుకుంది డా.స్నేహ.

కుర్చీలోంచి లేచి వచ్చి దిగులు పడిన రాజేష్ దగ్గగా వచ్చి ఆయన భుజం మీద చెయ్యి వేసింది.

" బోన్ మేరో టెస్ట్" అంటున్నాడు సుజిత్" ఆయన గొంతులో జీర.

" అనుకున్నాను అదే చెప్పి ఉంటారని" అంది నెమ్మదిగా.

" విషయం తెలుసుకోవడానికే అన్నాడు కానీ ఎందుకో స్వప్నిక రిపోర్ట్ చూడగానే ఏదోగా అనిపించింది" అంటూ ఇంకా ఏదో చెప్పబోతున్న భర్తని వారిస్తూ,

" ఆయన మాటే నాదీనూ.డాక్టర్లుగా మన పని మనం చెయ్యాలి కదా, ఆధారం లేకుండా ఏదీ అనుకోలేము, అనుమానించలేము. మన అనుమానం నిరాధారమైనది కావాలి అని కోరుకుంటూ టెస్ట్ చేయించడమే మనం చెయ్యవలసింది.  ఇలాగే సానుకూలంగా అనుకోవాలి మనందరం. స్వప్ని కేమీ కాదు" అంది స్థిరంగా.

" ఇది కిరణ్ కి, రాధికకి చెప్పడం ఎలాగ? బ్లడ్ టెస్ట్ అంటేనే భయపడింది స్వప్నిక" అన్నాడు రాజేష్.

" ఎలాగైనా చెప్పాలి కదా రాజా? డాక్టర్లుగా మనం కొన్ని విషయాని ప్రొఫెషనల్ గా చూడాలి. ఇమోషనల్ గా కాదు. ఎప్పుడూ చెప్పేదే నీకు" అంది ఆమె.

" చెప్పినంత సులభమా స్నేహా? నీకు తెలీదూ? డాక్టర్లకంటే ముందు మనం మనుషులం కాదూ?" అన్నాడాయన దిగులుగా.

“కాదనను రాజా, కానీ చెయ్యగలిగినదేముంది?”  అంది ఆయన చేతిని తన చేతిలోకి తీసుకుంటూ.

తర్వాత ఆమే " ఈ ఒక్కరోజూ ఆగుదాం, స్వాంతన పరచడానికి సమయం చాలా కీలకం. ఈ రాత్రి గడిస్తే నీకూ నీ ఇమోషన్ మీద కొంత కంట్రోల్ వస్తుంది. కిరణ్ వాళ్ళని రేపు పిలిచి మాట్లాడి చెప్పవచ్చు కదా?" అంది.

మౌనంగా తల ఊపాడు.

ఈ పరుగు వచ్చే నెలదాకా

Post your comments